మనిషిలోని కోతి కోరికలని రెచ్చకొడ్తుంది. నలుగురూ నవ్వుతారన్న భయాన్ని పక్కకి నెట్టేతే, ఖర్చులేని సరదాలని తీర్చుకొని, ఎంతో తృప్తి పొందవచ్చు.

## పసి మనసు

సత్యం పుట్టి పెరిగింది గునుపూడిలోనే! ఇప్పుడు హైదరాబాదులో స్థిరపడ్డాడంటే దానికి కారణాలనేకం. "నరవర నీచే, నాచే..."అన్నట్టుగా. ముప్పై ఏళ్ళుగా ఇక్కడే ఉద్యోగం చేశాడు. వివాహం, పిల్లలూ, ఇల్లూ - అలా ఒకటీ ఒకటీ తనని హైదరాబాదుకి బంధించేశాయి. అతను రిటైరయ్యే సమయానికి కొడుకూ ఇక్కడే ఉద్యోగంలో స్థిరపడ్డాడు.

మంచి ఏరియాలో చక్కటి ఫ్లాట్ కొన్నాడు - తన తరవాతి తరమైనా అద్దె కొంపల్లో నానా పాట్లూ పడకుండా సుఖపడాలని. ఇప్పుడు అంతా సొంత ఇంట్లోనే ఉంటున్నారు. కొడుక్కి మంచి ఉద్యోగమే కావడంతో, సత్యానికి వేరే ఉద్యోగం చేయవలసిన అవసరం లేకపోయింది. మనుమరాలు 'సాహితి'తో ఆడుకుంటూ, 'కృష్ణా రామా' అంటూ కాలక్షేపం చేసుకుంటున్నాడు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. కొడుకూ, కోడలూ తనని బాగానే చూసుకుంటున్నారు, వట్టిపోయిన గొడ్డుని విదిలించేసినట్టు కాకుండా! అటువంటి పిల్లలు ఉండడం కూడా అదృష్టంగానే చెప్పుకోవాలి మరి ఈ కాలంలో!

రోజూ కాలకృత్యాలు తీర్చుకుని, ఇంటి ముందు భాగంలోని వరండాలో రెండు పుస్తకాలు ముందేసుకుని కూర్చుంటాడు సత్యం. ఎదురుగా పిల్లలు ఆడుకునేందుకు మునిసిపాలిటీవాళ్లు కట్టిన పార్కు. అక్కడికి పిల్లల్ని ఆడుకోడానికి తీసుకిచ్చిన ముసలివాళ్లు బెంచీల మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. సాయంత్రం సమయంలో తనూ వాళ్లలో ఒకడు. ఇంకా రోడ్డు మీద హడావుడిగా ఆఫీసులకి పరుగులెత్తే నడి వయస్కులు, కిళ్లీ బడ్డీల దగ్గర చేరి దమ్ము లాగుతూ, వచ్చీపోయే ఆడవాళ్లకి బీటు కొట్టే రోడ్డు సైడు రోమియోలు, కూరలమ్ముకునేవాళ్లు - ఇలా అందర్నీ చూస్తూ కాలం గడిపేస్తుంటాడు సత్యం. సాయంకాలం అయ్యేసరికి మాత్రం మనుమరాలు 'సాహితి' ఠంచనుగా తయారైవస్తుంది. దాన్ని తాతయ్యే పార్కుకి తీసికెళ్లి ఆడించాలి. ఆ పార్కులో జారుడు బల్లలున్నాయి. ఉయ్యాలలున్నాయి. జిరాఫీ, ఏరోప్లేను లాంటి బొమ్మలున్నాయి. అన్నిటి లోనూ ఉయ్యాలంటే 'సాహితి'కి చాలా ఇష్టం. తను ఉయ్యాలలో కూర్చుని తాతయ్యని జోరుగా ఊపమంటుంది. తాతయ్యా నువ్వూ కూర్చో' అని మారాము చేస్తుంది.

"తప్పమ్మా! పెద్దవాళ్లు ఊగ కూడదు. అందరూ చూసి నవ్వుతారు" అని సత్యం వారిస్తాడు. ఆ పిల్ల మనసుకేం తెలుసు, మనిషి పెద్దవాడై ఇలాంటి ఆనందాలకి దూరమౌతాడని, యాంత్రిక జీవనంలో ఇటువంటి అదృష్టాలకి తావులేదని.

* * *

అలాంటి సమయాల్లోనే తన గత జీవితం జ్ఞాపకానికి వస్తుంది సత్యానికి.

గునుపూడిలో పెద్ద పెద్ద బాదం చెట్లు, జామచెట్లు, వేపచెట్లు, ఆడుకోడానికి కావలసినంత ఖాళీ స్థలం. ఆ స్థలాలు అప్పుడు ఎకరాల్లో కొలిచేవారు. ఇప్పుడు ఇళ్ళ స్థలాలు ఇక్కడ గజాల్లో కాదు, అడుగుల్లో కొలుస్తున్నారు. ఈ ఫ్లాటు అంతా కలిసి ఆరువందల అడుగులు, అందులోనే వంటా, వార్పూ, స్నానాలూ, పడకలూ అన్నీ.

సత్యం బాల్యం అంతా గునుపూడిలోనే గడిచింది. ఆ రోజులు వేరు. ఆ మనుషులు వేరు. ఆ ఆటాపాటా వేరు. సత్యం దొంగాట జట్టులో చాలాముందే ఉండేవాడు. గచ్చకాయగాడు, మల్లి, జీడిగాడు, గుండమ్మ, తప్పగాడు, ఆ యిల్లనీ - ఇంకా కొన్ని పేర్లు ఆలోచిస్తేగాని గుర్తుకురావు. వాళ్లకి ఈ యిల్లనీ, ఆ యిల్లనీ ఉండేది కాదు. అన్నీ వాళ్ల ఇళ్లే. ఇవతలి వీధిలో 'తల్లిరాట' ఉంటే అవతలి వీధికెళ్ళి దాక్కునేవారు దొరక్కుండా ఉండడానికి.

ఆటల హడావుడిలో ఆరేసుకున్న 'మడిబట్ట'ని ముట్టేసుకుంటే, "అంతా మంగళం చేసేస్తున్నార్రా!" అని అరిచి గోల పెట్టేది బామ్మ. ఆ అరుపులకి బిక్కచచ్చిపోయి నారింజ చెట్టు మూలని దాక్కుంటే "వెర్రినాగన్నా! పోయి ఆడుకో! మళ్లీ తడుపుకుంటాలే!" అని ముద్దు పెట్టుకునేది. మరి సత్యంది వాళ్ల తాతయ్య పేరు కదా. అందుకని పొరపాటున కూడా తిట్టేది కాదు.

మిగతా ఆటల సంగతి ఎలా ఉన్నా, కరణంగారి పెరట్లో బాదం చెట్టుకి కట్టిన ఉయ్యాల దగ్గర మాత్రం ఎప్పుడూ తగులాటగానే ఉండేది. కరణం బాబాయిగారికి పిల్లలు లేరు. పిన్నిగారికేమో పిల్లలంటే ప్రాణం.

నలుగురూ వచ్చి ఆడుకుంటారు కదా అని పెరట్లో ఉయ్యాల వేయించారు. కరణం బాబాయికి కోపమెక్కువ. గోలచేస్తే చంపేస్తానని బెదిరించేవాడు.

సాయంత్రం అయ్యేసరికి పిన్నిగారింటికి పది పదిహేను మందికి పైగానే పిల్లలు చేరేవారు. ఉయ్యాల ఊగడం కోసం, నేను ముందంటే నేను ముందని తోసుకుని కొట్లాడు కునేవారు. అక్కడికీ పిన్నిగారు దగ్గరుండి అందరికీ ఛాన్సు వచ్చేలా కంట్రోలు చేసేవారు. ఎప్పుడైనా ఖర్మం చాలక పిన్నిగారు ఇంట్లో లేకపోయారో, ఆ రోజు 'ఉద్యోగ విజయాలే!' సత్యానిది చిన్నప్పట్నించీ, పదిమందిలోకి చొచ్చుకుపోయే స్వభావం కాదు. అందువల్ల ఉయ్యాల ఊగడానికి అప్పుడప్పుడు ఛాన్సు వచ్చినా, కోరిక మాత్రం పూర్తిగా తీరేది కాదు. ఎంత ఊగినా ఇంకా ఊగాలనిపించేది. అప్పటి ఉయ్యాల వేరు. ఎత్తైన చెట్టు కొమ్మకి, మెత్తని పట్టులాంటి తాడు కట్టి చెక్కబల్ల అమర్చిన ఉయ్యాల అది. ఆరుబయట, చల్లని గాలిలో ఊగితే ప్రాణం లేచి వచ్చేది. ఇప్పటి పార్కుల్లో ఉయ్యాలలదేముంది. అంతా ఇనుము. గొలుసులు, ఇనుము. కూర్చునే బల్ల ఇనుము. స్తంభాలు ఇనుము. రోజంతా ఎండలో కాగి ఓ రాత్రప్పటికి కాని చల్లబడవు. అయినా ఉయ్యాల ఉయ్యాలే! అది ఊగడం ఆనందమే!

* * *

ఓ రోజు సాయంత్రం పార్కులో ఆడుకోవడం పూర్తయ్యాక సాహితిని ఇంటికి తీసుకొచ్చి

బాల్కనీలో కూర్చుని అదే ఆలోచిస్తున్నాడు సత్యం. రోజూ సాహితి పేచీ పెడుతోంది. "తాతయ్యా నువ్వూ ఊగు నాతో బాటు. చూడు ఎంత బాగుందో!" అని. ఆ అభ్యర్థన తన అంతరాంతరాల్లోని ఓ చిన్ని కోరికని బైటికి తీసుకొస్తోంది.

సత్యానికి ఉయ్యాల ఊగాలనే అనిపిస్తోంది. కానీ చుట్టూ ఉన్న వాళ్లేమనుకుంటారు? ముసలితనంలో నీకిదేం పిచ్చి? అని ఎగతాళి చేయరూ. ఇంత వయసొచ్చీ కుర్రతనం పోలేదు అనరూ? ఈ 'ఏమనుకుంటారో' అనే ఇనుప తెరని చించి అవలివైపు పారిపోవాలని పిస్తోంది సత్యానికి. కాని ధైర్యం చాలడం లేదు. నిజానికి దానికేమి ఖర్చు లేదు. అతీతమైన శక్తి కూడా అవసరం లేదు. మందీ మార్బలం అసలే అక్కర్లేదు. అయితే అలాంటి స్వల్పమైన కార్యాన్ని తను ఎందుకు చేయలేకపోతున్నాడు? ఆలోచించిన కొద్దీ కారణాలు సత్యానికి అంతుపట్టడం లేదు.

సాయంత్రం నెమ్మదిగా రాత్రిగా మారింది. రోడ్డు మీది జనసంచారం సద్దుమణుగు తోంది. సాహితీ ఎప్పుడో అన్నం తిని పడుకుంది. "మామయ్యా! భోంచేస్తారా?" అన్న కోడలు పిలుపుకి నిశ్శబ్దంగా లేచి వెళ్లి, భోం చేసి వచ్చి మళ్లీ ఆలోచిస్తూ కూర్చున్నాడు.

రాత్రి పది దాటినా పడుకోకపోతే, "నాన్నా ఒంట్లో బాగాలేదా!" అని పలకరించాడు కొడుకు. "బాగానే ఉంది బాబూ! మీరు పడుకోండి. నేను కాసేపు కూర్చుంటాను" అన్నాడు సత్యం. రాత్రి సాగి అర్ధరాత్రయింది. కృష్ణపక్ష చంద్రుడు ఆలస్యంగా ఉదయించాడు. వాతావరణం చల్లగా, హాయిగా ఉంది. సత్యం మనసులో చల్లటి ఆలోచన ఉదయించింది. కూర్చున్న చోటినుంచి లేచాడు. నెమ్మదిగా, చప్పుడు చేయకుండా ముందు తలుపు తీశాడు. మెట్ల మీదుగా క్రిందికి దిగాడు.

గబగబా రోడ్డు దాటి పార్కులో ప్రవేశించాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. చెట్లు కూడా నిద్రపోతున్నాయి. ఉయ్యాల బల్ల మీద కూర్చుని, మెల్లగా వణుకుతున్న చేతుల్తో గొలుసులు పట్టుకున్నాడు. చల్లగా తగిలాయి. నేల మీద ఒక తాపు తన్నాడు. సర్రున గాలిలోకి లేచింది ఉయ్యాల. మరో తాపు. జోరుగా, ఇంకా జోరుగా - ఆనందంతో గంతులు వేస్తోంది సత్యం మనసు. ఆ సమయంలో సత్యం తనని తాను మరిచాడు. ఈ ప్రపంచాన్నే ప్రక్కకి నెట్టేశాడు. రేపు కట్టవలసిన కరెంటు బిల్లు, ఫ్లాటుకి కట్టవలసిన వాయిదా, సర్వీసులో ఉండగా తనకి రాబోతూ ఆగిపోయిన ప్రమోషను, నమ్మించి దగా చేసిన తోటి ఉద్యోగులు - ఇవేవీ ఇప్పుడతని మనోఫలకం మీద లేవు. ఆనందం! పరమానందం! ఉయ్యాల ఊగుతున్న సంతోషం! అంతే! అతని మనసిప్పుడు సెలయేరై పారుతోంది. దానినెవరూ ఆపలేరు. 'ఎవరైనా చూస్తే?' అని సత్యంకి అప్పుడనిపించలేదు. ఆ తెర చిరిగిపోయింది. "అర్ధరాత్రప్పుడు, పార్కులో ఉయ్యాల మీద మీరేనా?" అని రేపు ఉదయం ఎవరేనా అడిగితే "అవును నేనే అయితేనేం?" అని ఎదురు ప్రశ్న వేయగలడు ఇప్పటి సత్యం.

*